
రేపటి నుంచి కళాక్షేత్రంలో ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన

కడప కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేలా కడప నగరంలోని కళాక్షేత్రంలో శుక్ర, శనివారాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నామని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి.సుమతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన జీఎస్టీ సంస్కరణల వల్ల వస్తువుల సేవలపై లభించే ఆర్థిక ప్రయోజనాలను తెలుసుకుని సూపర్ సేవింగ్స్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శనకోసం స్టాళ్ల ఏర్పాటుకు పలు సంస్థలు రానున్నాయని, గతంలో ధరలు, ప్రస్తుతం తగ్గిన ధరలు వివరంగా తెలుసుకునే వీలుంటుందని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ కమిషనర్ పేర్కొన్నారు.

ఇద్దరు ఎంపీడీవోలకు స్థానచలనం

కడప రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు ఎంపీడీవోలకు జడ్పీ సీఈవో స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలం నుంచి కమలాపురం ఎంపీడీవో షేక్ గౌస్‌బాషా, ఒంటిమిట్ట ఎంపీడీవో జె.సుజాతమ్మలపై పరిపాలనా పరంగా ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పరిపాలనా కారణాల వలన కమలాపురం ఎంపీడీవోను ఒంటిమిట్టకు, అలాగే ఒంటిమిట్ట ఎంపీడీవోను కమలాపురానికి బదిలీ చేశారు.

గుంతలకు మోక్షం



- రోడ్లలో గుంతలు పూడ్చడానికి గ్రీన్‌సిగ్నల్
- స్టేట్, మేజర్ రోడ్లకు నిధులు మంజూరు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులపై ప్రయాణం చేయలేక వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వైసీపీ హయాంలో రహదారుల మరమ్మతులను పట్టించుకోలేదు. అయితే చంద్రబాబు సర్కారు ఈ ఏడాది ఆరంభంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారుల్లో గుంతలను పూడ్చి ప్రయాణం సాఫీగా సాగేలా చేసింది. తీవ్ర వర్షాలు కురవడంతో మళ్లీ ఇప్పుడు గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటిని పూడ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా స్టేట్ హైవే, మేజరు డిస్ట్రిక్ట్ రోడ్ల మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. 108 స్టేట్ హైవే పనులకు రూ.400 కోట్లు, 166 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల పనులకు రూ.600 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జిల్లాలో స్టేట్ హైవేస్, మేజరు డిస్ట్రిక్ట్ రోడ్లలో పడ్డ గుంతలను పూడ్చనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవోఆర్‌టీ నెంబర్ 531 జారీ చేసింది. జిల్లాలో రూ.42.55 కోట్లతో రహదారుల గుంతలు పూడ్చనున్నారు.



పోరుమామిళ్ల మండలం తోకలపల్లిలో దెబ్బతిన్న రోడ్డు

స్టేట్ హైవే రోడ్లకు..

☛ కడప - పోరుమామిళ్ల రహదారిలో 17వ కి.మీ నుంచి 29.6 కి.మీ వరకు 12.6 కి.మీ మేర రహదారి రిపేరు చేయనున్నారు. ఇందుకోసం రూ.5 కోట్లు కేటాయించారు.

☛ ఖాజీపేట-కమలాపురం రహదారిలో 11వ కి.మీ నుంచి 16.5 కి.మీ వరకు మొత్తం 5.5 కి.మీకుగాను రూ.3 కోట్లు మంజూరు చేశారు.

☛ మైదుకూరు-నెల్లూరు-బళ్లారి-బాంబే రోడ్డులో 170.2 కి.మీ నుంచి 172.65 వరకు, 173.725 కి.మీ నుంచి 175.8 వరకు మొత్తం మరమ్మతులకు రూ.5కోట్లు కేటాయించారు.

☛ మైదుకూరు - నెల్లూరు - బళ్లారి - బాంబే రోడ్డులో ఇంప్రూవ్‌మెంటు కోసం రూ.2.50 కోట్లు కేటాయించారు.

మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు..

✶ పళ్లూరు - ఒంటెద్దుపల్లి, ఎస్.కొట్టాలపల్లె - వెల్లాల రోడ్డు, పెద్దముడియం - జనగానపల్లె రోడ్డు మొత్తం 12 కి.మీ ఇంప్రూవ్‌మెంటు కోసం రూ.4.40 కోట్లు ఇచ్చారు.

✶ గూడెంచెరువు - దొప్పెర్ల, ఉప్పలపాడు - మేడిదిన్నె రోడ్డు, మాధవరం - బెస్తవేముల రోడ్డులో మొత్తం 14 కి.మీ ఇంప్రూవ్‌మెంటు కోసం రూ.4.90 కోట్లు మంజూరు చేశారు.

✶ ప్రొద్దుటూరు - అర్కటవేముల రోడ్డు 0కిమీ నుంచి 0.7 కి.మీ వరకు పీసీ రోడ్డు, ముంబై - నెల్లూరు - బళ్లారి - బాంబే రహదారి వయా రాధానగర్ 0.కిమీ నుంచి 7 కిమీ వరకు ఇంప్రూవ్‌మెంటు కోసం రూ.3.75 కోట్లు కేటాయించారు.

✶ రామదాసుపురం-రాజువారిపేట రోడ్డు, అయ్యవారుపల్లె - కొల్లూరు రోడ్డు, వయా నాగుల్‌పల్లె - మాచనపల్లె - కామనూరు, గుంతచీపాడు - అన్నవరం వయా చందలూరు .. మొత్తం 11.90 కి.మీకు రూ.4.80 కోట్లు కేటాయించారు.

✶ రామాపురం - వైపీ రోడ్డు వయా బలపనూరు - సంతకొవ్వూరు, ఊటుకూరు.. మొత్తం 9.20 కి.మీగాను రూ.3.60 కోట్లు ఖర్చు చేయనున్నారు.

✶ చిలమకూరు-వీరపునాయునిపల్లె రహదారి 17 కి.మీ నుంచి 19.6 కి.మీ వరకు 21కి.మీ నుంచి 25 కి.మీ వరకు రూ.2.20 కోట్లు కేటాయించారు.

✶ ఎంపీ రోడ్డు - టేకూరుపేట వయా తోకలపల్లె రోడ్డు 8 కి.మీ కోసం రూ.3.40 కోట్లు మంజూరు చేశారు.

జిల్లాలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు మొక్క ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ బుధవారం జిల్లాకు చేరుకున్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన ఆయనను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అంతకు ముందు ఆయనకు జిల్లా అధికారులు, స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. ఆయన పలువురు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌ఎస్, ఎస్సీ నాయకులతో భేటీ అయ్యారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయనను కలిసిన వారిలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

వైవీయూ వీసీగా రాజశేఖర్ బెల్లంకొండ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వైస్‌చాన్సలర్‌గా హైదరాబాద్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీకాలం నియామక తేదీ నుంచి మూడు సంవత్సరాలు ఉంటుంది. ఈయన వైస్ చాన్సలర్‌గా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకంతో యోగివేమన విశ్వ విద్యాలయం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నట్లు పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కాగా.. విద్య, పరిశోధన, సైకాలజీ రంగాల్లో విశిష్టప్రతిభతో డాక్టర్ రాజశేఖర్ బెల్లకొండ విశేష గుర్తింపు పొందారు. వీరు సివిల్ ఇంజనీరింగ్ (బీటెక్, ఆచార్య నాగార్జున), మేనేజ్‌మెంట్ (ఎంబీఏ, ఉస్మానియా), మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ (కాకతీయ), సైకాలజీ ఎమ్మెస్సీ అండ్ పీహెచ్‌డీ (శ్రీవేంకటేశ్వర), ఎడ్యుకేషన్ ఎంఏ (ఇగ్నో), పీహెచ్‌డీ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ) చదివారు. అహ్మదాబాద్‌లో ఎఫ్‌డీపీ (ఐఐఎం), పీజీడీపీఎంఐఆర్ (కాకతీయ), పీజీడీసీఏస్ (హైదరాబాద్) వంటి ప్రతిష్ఠాత్మక కోర్సులు పూర్తిచేసి, విద్యా, పరిశోధన మరియు శిక్షణ రంగాలలో మేటి ప్రామాణికత నెలకొల్పారు.

ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జయరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌గా ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డిని నియమిస్తూ గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈయన మూడు సంవత్సరాల పాటు వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

దీర్ఘకాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- ఎక్కువసార్లు వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్



ప్రత్యేక పీజీఆర్‌ఎస్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యలపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక దృష్టి సారించారు. ఒకటి కంటే ఎక్కువసార్లు ఒకే సమస్యపై అర్జీలు సమర్పించిన బాధితులతో కలెక్టరే స్వయంగా మాట్లాడారు. ముఖ్యంగా రెవెన్యూ, భూ సమస్యలు, కోర్టు వ్యవహారాలు, కుటుంబ భాగ పరిష్కారాలు తదితర అంశాలపై అర్జీదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రత్యేక ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులు, తహశీల్దార్లు, సిబ్బందితో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి ప్రజాఫిర్యాదుల పునఃపరిశీలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్‌ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా దీర్ఘకాలికంగా పరిష్కారం కాని భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల వారీగా రికార్డులతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వీటితో పాటు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు జిల్లా నుంచి అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. కాగా.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీదారులకు, వారి కుటుంబ సభ్యులకు రెవెన్యూ యంత్రాంగం భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సర్వే ల్యాండ్ ఏడీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సీకేదిన్నెలో రాజకీయ రచ్చ

- ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆరోపణ
- మండల మీట్‌కు వైసీపీ ఎంపీటీసీల ఎగనామం
- కోరంలేక వాయిదా పడిన సమావేశం



కడప రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో వైసీపీ ఎంపీటీసీ సభ్యులు రాజకీయ రచ్చకు దిగారు. ఎమ్మెల్యేకు ప్రాధాన్యత కల్పిస్తూ మండల సర్వసభ్యసమావేశాన్ని ఉదయం బదులు మధ్యాహ్నానికి మార్చారంటూ ఆరోపించారు. వీరంతా మూకుమ్మడిగా ఎగనామం పెట్టడంతో కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో వాయిదా వేయాల్సి వచ్చింది.

అందరూ ఏకగ్రీవమే

వైసీపీ పాలనలో 2021లో నిర్వహించిన ఎన్నికల్లో చింతకొమ్మదిన్నె మండలంలోని 9 ఎంపీటీసీ స్థానాల్లోను వైసీపీ అధికారబలం ఉపయోగించి ఏకగ్రీవాల పేరుతో కైవశం చేసుకుంది. నాటి నుంచి వైసీపీ పాలకమండలి ఆధ్వర్యంలోని మండల సర్వసభ్య సమావేశాలతో పాటు అధికారులు వారి కనుసన్నల్లోనే నడుస్తూ వచ్చారు. 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ వారి ఆధిపత్యమే కొనసాగుతోంది. ఇందుకు టీడీపీకి చెందిన కొందరు మండల నాయకులకు, వైసీపీ ఎంపీటీసీలకు మధ్య అన్ని వ్యవహారాల్లోను సంబంధాలతో పాటు, బంధుత్వాలు బలంగా ఉండడమే. వెరసి చింతకొమ్మదిన్నె మండలంలో వైసీపీ ఎంపీటీసీల హవా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించాలని 10 రోజుల క్రితమే ఖరారు చేశారు. ఈమేరకు ఎంపీటీసీలకు సమాచారాన్ని ఎంపీడీవో కార్యాలయం పంపింది. అయితే కొన్ని ముఖ్యకారణాల వలన సమావేశాన్ని ఉదయం కాకుండా ఆదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీలకు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే సమయం కోసమే ఎంపీడీవో అలా చేశారని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి డుమ్మాకొట్టారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. తదుపరి సమావేశాన్ని ఎంపీపీ అనుమతితో త్వరలో నిర్ణయిస్తామన్నారు. కాగా.. 30 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించాలంటూ బుధవారం వైఎస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎంపీటీసీల గౌరవవేతనాల చెల్లింపు ప్రభుత్వ పరిధిలో ఉందని అన్నారు.

మైలవరం డ్యాం గేట్ల పటిష్టతకు రూ.3.19 కోట్లు మంజూరు



కలికిరి /మైలవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైలవరం డ్యాంకు అమర్చిన రేడియల్ క్రస్ట్ గేట్లను పటిష్టవంతం చేసేందుకు రూ.3,19,48,000 మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్రస్ట్ గేట్ల నిర్వహణలో భాగంగా మరింత పటిష్టవంతం చేసేందుకు జలవనరుల శాఖ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. క్రస్ట్ గేట్లను పటిష్టం చేసే క్రమంలో అవసరమైన ప్లేట్లు, యాంగిల్స్, హై టెన్షన్ బోల్టులు, నట్‌లు ఉపయోగించాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

నకిలీ మద్యం తయారీని అరికట్టాలి

- తులసిరెడ్డి డిమాండ్

వేంపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ప్రజల ప్రాణాల మీద, ప్రజల క్షేమం మీద చిత్తశుద్ధి ఉంటే.. వెంటనే బెల్టుషాపులను, నకిలీ మద్యం తయారీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్న విధంగా మద్యం పాలసీ తయారైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ విచ్చలవిడిగా కొనసాగుతోందని తెలిపారు. మద్యం వలన రాష్ట్రంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ముదిపర్తిలో మద్యం మత్తులో తండ్రి రవికుమార్ కొడుకు ప్రేమ్‌చంద్‌ను రోకలిబండతో మోది చంపాడని, బాపట్ల మండలం పూల గ్రామంలో కొడుకుజాలయ్య తల్లి రమణమ్మను ఇనుపకడ్డీతో మోది చంపాడని మదనపల్లెలో 7, 10 తరగతులు చదువుతున్న బిడ్డల మీద తల్లి వాణి మద్యానికి బానిసై రోజు కర్రతో బాదుతోందని పోలీస్‌స్టేషన్‌లో పిల్లలు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే అని, కూటమి ప్రభుత్వం సంపూర్ణ మద్యపాననిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు.


మహిళా ప్రపంచకప్ క్రికెట్ స్కోరర్‌గా రామకృష్ణ



వాల్మీకిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గురువారం జరగనున్న ఐసీసీ మహిళా క్రికెట్ ప్రపంచకప్ పోటీకి స్కోరర్‌గా వాల్మీకిపురం వాసి బి.రామకృష్ణ ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ తెలిపారు. విశాఖపట్నంలో ఈనెల 9న ఇండియా-సౌతాఫ్రికా, 12న ఇండియా-ఆస్ట్రేలియా, 13న సౌతాఫ్రికా-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌లకు రామకృష్ణ స్కోరర్‌గా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వాల్మీకిపురం నుంచి క్రికెట్ ఆడుతూ తర్వాత స్కోరర్‌గా చిత్తూరు జిల్లా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పదేళ్లుగా స్కోరర్‌గా కొనసాగుతున్నానన్నారు. ప్రస్తుతం మహిళా ప్రపంచ కప్ పోటీలకు స్కోరర్‌గా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

రబీకి సానుకూల వర్షాలు

- సిద్ధంగా 37 వేల క్వింటాళ్ల బుడ్డశనగలు
- పంపిణీకి నేటి నుంచి రిజిస్ట్రేషన్



కడప రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు రాకముందే సాగుకు అనుకూలమైన వర్షాలు పడుతున్నాయి. ఈ మేరకు 6వతేదీ సోమవారం జిల్లా అంతటా 1250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లోని 9 మండలాల్లో 268 మిల్లీమీటర్లు, బద్వేలు డివిజన్‌లోని 9 మండలాల్లో 318 మి.మీ, జమ్మలమడుగు డివిజన్‌లో 10 మండలాల్లో 399.6 మి.మీ, పులివెందుల డివిజన్‌లోని 8 మండలాల్లో 83.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు కుందూ, పెన్నా, పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతాల్లో అక్కడక్కడ వరిపంట దెబ్బతింది. అలాగే కొండాపురం, బద్వేలు, బి.మఠం, గోపవరం, కడప, పెండ్లిమర్రి, చక్రాయపేట, మైదుకూరు, వీరపునాయునిపల్లె తదితర మండలాల్లో ఓ మోస్తారు వర్షాలు పడడంతో ఉల్లి, పసుపు, వేరుశనగ, చిక్కుడు తదితర పంటలు దెబ్బతిన్నాయి. అలాగే వారం క్రితం కురిన వర్షాలకు కూడా జిల్లాలో 3500 ఎకరాల వరకు వరి, మొక్కజొన్న, వేరుశనగ, సోయా చిక్కుడు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు.

కిలో రూ.58.50తో బుడ్డశనగల పంపిణీ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు కాస్త నష్టం చేకూర్చినప్పటికి.. రబీ సాగుకు ప్రయోజనకరంగా ఉండడంతో బుడ్డశనగ విత్తనాల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. రబీలో 1,80,000 వేల ఎకరాలలో బుగ్గశనగ సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాకు 37 వేల క్వింటాళ్ల బుడ్డశనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. వీటి పంపిణీకి గురువారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం జిల్లాకు మంజూరైన 37 వేల క్వింటాళ్లే కాకుండా అదనంగా మరో 22 వేల క్వింటాళ్ల బుడ్డశనగ విత్తనాలు అవసరంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ తెలిపారు. వీటితో పాటు జిల్లాకు 850 క్వింటాళ్ల మినుములు మంజూరు అయ్యాయని మరో 1250 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపించామని ఆయన చెప్పారు. కాగా.. రబీ సాగుకు అవసరమైన బుడ్డశనగల విత్తనాల ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. కిలో రూ.78గా నిర్ణయించింది. ఇందులో 25 శాతం సబ్సిడీతో కిలో రూ.58.50కే రైతులకు ఇవ్వనున్నారు.

పులివెందులకు.. విద్యుత్ షాక్

- రోజురోజుకూ పెరుగుతున్న బిల్లుల భారం
- పెండింగ్‌లో రూ.42 కోట్ల విద్యుత్ బిల్లులు



పులివెందుల మున్సిపాలిటీ కార్యాలయం

పులివెందుల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం విద్యుత్ బిల్లులకు కూడా సరిపోవడం లేదు. ఏడాదికి రూ.9కోట్లు రాబడి ఉంటే నెలకు విద్యుత్ బిల్లులే దాదాపు రూ.1.30కోట్ల నుంచి రూ.1.50కోట్ల దాకా వస్తున్నాయి. దీంతో మున్సిపాలిటీకి విద్యుత్ మోయలేని భారంగా మారింది.

పులివెందుల మున్సిపాలిటీ ఇద్దరు ముఖ్యమంత్రులకు ప్రాతినిథ్యం వహించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వైఎస్ హయాంలో 2005లో పులివెందుల పట్టణాన్ని మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా మిగులు బడ్జెట్ ఉండాలి. కానీ కొన్నేళ్లుగా వచ్చిన ఆదాయమే విద్యుత్ బిల్లులకు సరిపోవడం లేదు.

పులివెందుల మున్సిపాలిటీలో రెండు రకాల మీటర్లు ఉన్నాయి. వీధిలైట్లు, తాగునీటి బోర్లకు సంబంధించి దాదాపు 305 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటితో పాటు మరో ఐదు హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. ఈ హెచ్‌టీ కనెక్షన్లు తాగునీటి అవసరాల కోసం నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ నుంచి నీటిమోటార్లకు ఉపయోగిస్తారు. 305 విద్యుత్ కనెక్షన్లకు ప్రతినెల దాదాపు రూ.70లక్షల పైచిలుకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. హెచ్‌టీ మీటర్లకు సంబంధించి రూ.65.44లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నట్లు అధికారిక లెక్క. వేసవిలో అయితే ఈ బిల్లులు మరో రూ.20లక్షలు పెరుగుతాయి. అయితే.. మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. బడ్జెట్‌ను బట్టి కొంత మేర బిల్లులు చెల్లించి మిగిలింది బకాయిల రూపంలో ఉంచుతోంది. దీంతో ఇప్పటికి రూ.42,17,27,819 విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

జగన్ ప్రభుత్వం రాకమునుపు పులివెందుల మున్సిపాలిటీ 'సీ' కేటగిరీ కింద ఉండేది. జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక పులివెందుల మున్సిపాలిటీని 'బీ' కేటగిరీకి అప్‌గ్రేడ్ చేసింది. దీనితో ప్రభుత్వాల నుంచి రావాల్సిన కొన్ని రకాల నిధులు ఆగిపోయాయని మున్సిపాలిటీకి చెందిన ఓ అధికారి తెలిపారు. మున్సిపాలిటీకి ఏడాదికి వివిధ పన్నుల రూపంలో రూ.9కోట్ల ఆదాయం వస్తోంది. విద్యుత్ బిల్లులు సరాసరిన ఏడాదికి రూ.18 కోట్లు వస్తున్నాయి. అంటే మున్సిపాలిటీ ఆదాయం మొత్తం కూడా ఈ విద్యుత్ బిల్లులకే సరిపోవడం లేదు. విద్యుత్ బకాయిలు చెల్లించలేక పులివెందుల మున్సిపాలిటీ సతమతం అవుతోంది. దీనిపై మున్సిపల్ డీఈ సురేశ్‌బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చానన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో నీటిమోటార్లు ఎక్కువ ఉండటంతో విద్యుత్ బిల్లులు ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నామని చెప్పారు

లారీ ఢీకొని యువకుడు మృతి


మహేంద్ర (ఫైల్‌పొటో)

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారిలో మంగళవారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పోలీసుల వివరాల మేరకు.. రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకుల పేటకు చెందిన బొక్కసం మహేంద్ర (27) అనే యువకుడు తన మోటారు సైకిల్‌లో బుధవారం తిరుపతి వైపు వెళుతుండగా వెనక వైపు నుంచి ఓ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొని వెళ్లింది. దీంతో మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఎడమ చేయి పూర్తిగా తొలగిపోయింది. నడుము భాగంలో బలమైన గాయాలయ్యాయి. లారీని అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు శవాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..


జనార్దన్ మృతదేహం

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నంబే పల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లికు చెందిన రైతు నల్లబోతుల జనార్ధన (50) మిల్లర్ రిపేర్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి బుధవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... జనార్ధన్ తన సొంత ట్రాక్టర్‌తో ఉలవపంట సాగు కోసం పొలానికి వెళ్లినట్లు తెలిపారు. మిల్లర్ బ్లేడ్లు ఊడిపోవడంతో ట్రాక్టర్ ఆపి బిగిస్తూ ఉండగా అనుకోకుండా ట్రాక్టర్ వెనక్కు రావడంతో రైతు ట్రాక్టర్ కిందపడినట్లు తెలిపారు. పొలం దగ్గరలో ఉన్న గ్రామస్థులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం రాయ చోటి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు కలరు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అడవికమ్మపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..


ధనంజయ (ఫైల్‌పొటో)

పీలేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇందిరమ్మ కాలనీలో నివాసముం టున్న పి.ధనుంజయ(29) జేసీబీ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడేళ్ల క్రితం పావనితో వివాహమైంది. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పాటు పిల్లలు కలగకపోవడంతో ధనంజయ తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో మంగళవారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రహీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకున్న రాజస్థాన్ వాసి..

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం బి.కొత్తకోటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... రాజస్థాన్‌లోని బాలహోత్రా జిల్లా, శివన గ్రామానికి చెందిన ఉత్తంసింగ్ కుమారుడు విక్రంసింగ్(26) బి.కొత్తకోటలోని పోకనాటివీధిలో ఓ అద్దెగదిలో వుంటూ స్థానికంగా ఉన్న ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేసుకుంటున్నాడు. మంగళవారం షాపుకు సెలవు కారణంగా రూములోనే వున్నాడు. ఇతని చెల్లెలు ఫోన్‌చేయగా ఎంతకూ తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇక్కడే ఉంటున్న తమ బంధువును రూం వద్దకు పంపింది. అతను వెళ్లి చూడగా నైలాన్‌తాడుతో ఫ్యానుకు ఉరివేసుకొని మృతిచెంది వుండటం గమనించాడు. మృతుడి చెల్లెలు నిర్మలకన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ వికటించి వృద్ధురాలు..


గంగులమ్మ మృతదేహం

మదనపల్లెటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తుంటి ఎముక విరిగి ఆపరేషన్ చేయిం చుకున్న ఓ వృద్ధురాలి ప్రాణాలకే ఎసరు వచ్చింది. వైద్యుడు చేసిన ఆపరేషన్ వికటించి ఆమె మృతి చెందింది. వివరా ల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఘాజీపేటకు చెందిన గంగప్ప భార్య గంగులమ్మ(60) ఇంట్లో కాలుజారి కిందపడటంతో తుంటి ఎముక విరిగింది. దీంతో ఆమెను మదనపల్లె సొసైటీ కాలనీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు శస్త్రచికిత్స చేయడానికి ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 4న ప్రభుత్వ అనుమతులు రావడంతో ఆ ఆస్పత్రిలో కాకుండా పట్టణంలోని సుందరరాజ్ పెట్రోల్‌బంక్ ఎదురుగా వున్న వీధిలోని మరో ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 7న గంగులమ్మకు ఇద్దరు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరోజునే గంగులమ్మకు ఆపరేషన్ వికటించి ఆయాసం ఎక్కువ కావడంతో, ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం గంగులమ్మ మృతికి వైద్యులే కారణమంటూ ఆమె కుటుంబీకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వన్‌టౌన్ సీఐ మహ్మద్‌రఫి, ఎస్‌ఐ శివకుమార్ ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని బాధితులను విచారించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు కానట్లు తెలిసింది.

విద్యార్థిపై మూకుమ్మడి దాడి

● 108లో మదనపల్లెకు తరలింపు

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అంగళ్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకునే విద్యార్థుల బృందం హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. వీరిలో కొందరి మధ్య వివాదం తలెత్తింది. పరస్పరం ఘర్షణ పడ్డారు. వీరిలో ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన వివేక్‌పై మిగతా విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో వివేక్‌కు రక్త గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో చేరాడు. స్థానిక అవుట్‌పోస్టు సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రక్షణకు పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

కామ్మో.. కుక్కలు..!

● పట్టణాల్లో ఎటుచూసినా గుంపులే
● ద్విచక్రవాహనదారులను వెంటపడుతున్న వైనం
● జిల్లాలో 3 వేల మందికి కుక్కకాట్లు
● అత్యధికంగా మదనపల్లెలో 806 మంది
● బెంబేలెత్తుతున్న ప్రజలు ● అధికార యంత్రాంగం విఫలం



రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకు కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుంపులుగా చేరి ప్రజలపై దాడి చేస్తుండడంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతూనే ఉన్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లె, వాయల్పాడు లాంటి ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల వెంబడి గుంపులుగా తిరుగుతున్న కుక్కలు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆడుకుంటున్న చిన్నపిల్లలపై రక్తస్రావమయ్యేలా దాడి చేస్తున్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా వీధుల్లో గుంపులుగా చేరి ద్విచక్ర వాహనదారులను వెంటపడుతుండడంతో వారు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా జూన్ 1 నుంచి ఆగస్టు 31వ తేది వరకు 2,929 మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 1841 మంది పురుషులు, 1088 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. ఇందులో అత్యధికంగా మదనపల్లి ప్రాంతంలో 806 మంది, రాయచోటి ప్రాంతంలో 295 మంది, చిట్వేలి ప్రాంతంలో 272 మందికి కుక్కకాటుకు గురికావడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలపై సైతం కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఏదేమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు చేయడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రాయచోటిలో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

కుక్కలతో భయమేస్తోంది

● నాగేశ్వరరావు, రాయచోటి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలను స్కూల్‌కు, ట్యూషన్‌కు ఒంటరిగా పంపించాలంటే భయమేస్తోంది. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి.

వాహనాల వెంటపడుతున్నాయి

● శ్రీరాములు, బాధితుడు, రాయచోటి



పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుక్కలు వాహనాల వెంటపడుతున్నాయి. అసలు ఒంటరిగా వెళ్లలేకున్నాం. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులకే పరిమితమయ్యారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయడం లేదు.

టీకాలు అందుబాటులో ఉన్నాయి

● డాక్టర్ లక్ష్మీనరసయ్య, డీఎంఅండ్‌హెచ్‌వో

జిల్లా వ్యాప్తంగా ప్రతి పీహెచ్‌సీ సెంటర్‌లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్కకాటుకు గురైనా, గాయాలపాలైనా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించుకోవాలి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

● ఆపై దాడి చేసిన యువకులు
● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం


కండక్టర్‌పై దౌర్జన్యం చేసేందుకు బస్సు ఎక్కుతున్న యువకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాజంపేట డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దౌర్జన్యం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకెళ్తే.. పల్లె వెలుగు బస్సు ఈ నెల 5వ తేదిన సాయంత్రం రాజంపేట నుంచి తిరుపతికి వెళ్తోంది. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు మీదుగా 125 మంది ప్రయాణికులతో వెళ్తుండగా శెట్టిగుంట దగ్గర ప్రయాణి కులు బస్సును ఆపారు. కానీ సీట్లు లేకపోవడంతో డ్రైవర్ బస్సు ఆపలేదు. దీంతో ఆగ్రహించిన శెట్టిగుంటకు చెందిన కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో వెంబడించి బస్సు డ్రైవర్‌పై దాడికి దిగడమే కాకుండా కండక్టర్‌పై దుర్భాషలాడారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ చేయడంతో రైల్వేకోడూరు పోలీసులు విచారిస్తున్నారు. జరిగిన సంఘటనపై విచారించేందుకు రాజంపేట ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నామని, వారు వచ్చిన తర్వాత పూర్తి సమాచారం తెలుస్తుందని ఎస్‌ఐ పీఎల్ ప్రసాద్‌రెడ్డి వివరించారు. కాగా రాజంపేట డిపోలో బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి / ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమా ?


మృతిచెందిన రంజిత్‌కుమార్

మదనపల్లెటౌన్/నిమ్మనపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో కోసుకుపోయిన రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు చేయని కారణంగా ఓ నిండు ప్రాణం గాల్లో కలసి పోయింది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె- నిమ్మనపల్లె మధ్య ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పలుచోట్ల గుంతలు పడడంతో పాటు, ఇరుకు రోడ్డు వుండటంతో ఇరువైపులా రోడ్డు కోసుకుపోయింది. ఈ క్రమంలో నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన చంద్రశేఖర్, రెడ్డిరాణి దంపతుల కుమా రుడు రంజిత్‌కుమార్ (20) డిగ్రీ చదువుకుంటూ, ఓ ఫోటో స్టూడియోలో ఎడిటింగ్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంజిత్‌కుమార్ ద్విచక్రవాహనంలో తవళం నుంచి మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో వశిష్ట హైస్కూల్ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును రంజిత్ ఓవర్‌టేక్ చేశాడు. తారు రోడ్డు దిగి, తిరిగి రోడ్డు ఎక్కుతున్న రంజిత్ ద్విచక్రవాహనం బెర్మ్ సరిగ్గా లేకపోవడంతో జారి పడిపోయింది. ఈ ఘటనలో రంజిత్ తారు రోడ్డుమీద పడిపోవడం, వెనక వస్తున్న ఆర్టీసీ బస్సు రంజిత్ శరీరంపై ఎక్కడం ఒక్కసారిగా జరిగిపోయాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌కుమార్‌ను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించి రంజిత్ మృతిచెందాడు. దీంతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. కాగా ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థి ప్రాణాలు పోయాయని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఆరోపించారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

● ఐదుగురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, జూదం అరికట్టేందుకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి చేపట్టిన డ్రోన్‌తో తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచిన రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో పూలగుంట్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న కోడి పందేలను గుర్తించామన్నారు. కోడి పందేల స్థావరం వద్దకు వెళ్లిన డ్రోన్‌ను చూడగానే, కోడిపందెం రాయుళ్ల ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి కొండలు, గుట్టల గుండా పరుగులు తీశారు. వీరిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని సంఘటన స్థలం నుంచి ఆరు ద్విచక్రవాహనాలు, ఒక పందెం కోడి స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.


కోడిపందేలు ఆడుతున్న స్థావరం వద్దకు డ్రోన్‌ను పంపుతున్న ఎస్‌ఐ

అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడు మృతి

మదనపల్లెటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన రెడ్డెప్ప కుమారుడు సుంకరరెడ్డి(42) మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సుంకరరెడ్డి గత కొంత కాలంగా మద్యానికి బానిసై, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సుంకరరెడ్డి భార్య జయమ్మ కుమార్తె, అల్లుడితో కలసి మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లారు. బుధవారం మదనపల్లెకు తిరిగి వచ్చి ఇంటి తలుపులు వేసి వుండటంతో భర్త సుంకరరెడ్డిని పలుమార్లు పిలిచింది. ఎంతసేపటికి ఇంటి తలుపులు తెరవకపోవడంతో పాటు ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంటి తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి పరిశీలించగా సుంకరరెడ్డి మృతదేహం కనపడింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందాడా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి వుంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి: డీఈవో

రాయచోటిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి చెకుముకి సంబరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు తోడ్పడతాయన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా ఈ సంబరాల్లో పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫకృద్దీన్ మాట్లాడారు. జిల్లాలోని 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబరు 18న, మండల స్థాయిలో నవంబరు 1న జిల్లా స్థాయిలో 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ జనార్ధన్, ప్రధానోపాధ్యాయుడు శివయ్య, రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

గాలివీడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన బాబాబీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని నూలివీడు గ్రామం వడ్లపల్లికి చెందిన రాళ్లపల్లి బాబాబీ అనే మహిళ ఎస్పీ కార్యాలయంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి నూలివీడు గ్రామం నాగూరువాండ్లపల్లెకు చెందిన రామచంద్ర కుమార్తె శారద వద్ద బంగారం రూపంలో రూ.7 లక్షలు, నగదుగా రూ.11.50 లక్షలు మొత్తం రూ.18.50 లక్షలు తీసుకొని ఎలాంటి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిందని బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఘటనపై గాలివీడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్లకు ఎంపిక


జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

సుండుపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఉమ్మడి కడప జిల్లా టీంలకు సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ రాధారాణి తెలిపారు. బుధవారం కడప జిల్లాలోని పోరుమామిళ్లలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రాష్ట్ర జట్టు ఎంపికల కోసం సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సాఫ్ట్‌బాల్ అండర్-19 బాలికల విభాగంలో బేబీ, బాలుర విభాగంలో ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తమ ప్రతిభను చాటి సెలెక్టర్ల దృష్టిలో పడ్డారు. బేస్‌బాల్ బాలికల విభాగంలో శ్రీలత, బేబి, బాలుర విభాగంలో భరత్ సత్తా చాటారు. దీంతో వీరికి సెలెక్టర్లు జిల్లా జట్లలో స్థానం కల్పించారు. వెంకటేశ్వర్లను బేస్‌బాల్ జట్టులో స్టాండ్ బైగా తీసుకున్నారు.

విద్యార్థి ఘటనపై విచారణ


విద్యార్థితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రిషివాటిక గురుకులంలో జరిగిన సంఘటనలో శేషాద్రిరెడ్డి అనే విద్యార్థికి కంటి చూపు పోయింది. ఈ మేరకు బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనరసయ్య విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించి చూపు పూర్తిగా దెబ్బతినిందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలని జిల్లా అధికారిని కోరారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనరసయ్య పిల్లవాడికి న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుల్లెట్‌వాహనాన్ని లారీ ఢీకొనడంతో
ఇద్దరి దుర్మరణం



హాజీవల్లి, రామ్మోహన్ మృతదేహాలు, (ఫైల్ ఫొటోలు)

ముద్దనూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బుల్లెట్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా... చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికి గ్రామానికి చెందిన రామ్మోహన్(35), చిలమకూరు గ్రామానికి చెందిన హాజీవలి (31) లారీ డ్రైవర్లు. వీరు ముద్దనూరులో భోజనం చేసుకొని బుల్లెట్ వాహనంపై చిలమకూరు వద్ద ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు వెళుతున్నారు. ముద్దనూరు వైపు నుంచి బళ్లారి నుంచి చైన్నైకి ఐరన్ వోర్ మట్టిని తరలిస్తున్న లారీ కొత్తపల్లె గ్రామ సమీపంలోని సున్నపురాళ్లపల్లె క్రాస్ వద్ద బుల్లెట్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో హాజీవలి సంఘటనా స్థలంలో మృతి చెందగా, రామ్మోహన్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు లారీని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నూర్జహాన్ మృతదేహం

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అండ్లగుత్తి నూర్జహాన్ (59) అనే మహిళ బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల మేరకు.. నూర్జహాన్ తన ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా చెక్కబోర్డు (నీళ్ల మోటారుకు సంబంధించిన బోర్డు)పై నీళ్లు పడ్డాయి. గమనించిన ఆమె బోర్డుకు ఉన్న ప్లగ్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఈ ప్రమాదం జరిగిందన్నారు. నూర్జహాన్ మృతితో ఆమె భర్త మహమ్మద్, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు



శిక్ష పడ్డ ఖైదీతో పోలీసులు

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసుకు సంబంధించి నిందితుడు మల్లికార్జునకు జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని బుధవారం తీర్పునిచ్చినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామ క్రిష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప మారుతీనగర్‌కు చెందిన మల్లికార్జున ఈడీ ఎంఎస్ స్కానింగ్ సెంటరు నిర్వహిస్తుండే వాడు. అతని వద్ద కంప్యూటరు ఆపరేటర్‌గా కడప నిరంజన్‌నగర్‌కు చెందిన చిట్టివేలి భవాని శంకర్ పనిచేస్తుండేవాడు. ఈక్రమంలో మల్లికార్జున భార్యతో భవాని శంకర్‌కు వివాహేతర సంబంధం ఉందని అనుమానించేవాడు. ఈ క్రమంలో 2023 నవంబరు 11న మల్లికార్జున తన ఆఫీసు వద్దకు రావాలని భవానీ శంకర్‌ను పిలిపించుకుని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న మచ్చుకత్తితో భవానీ శంకర్‌ను విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. మృతుడి భార్య బాబాబి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ నాగరాజు కేసు నమోదు చేసి, మల్లికార్జునను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి యామిని నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కదీరున్నీసా వాదించారని సీఐ తెలిపారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

కొండాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిపాడు గ్రామంలో నలుగురు కోడిపందెం రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వెంకయ్యకాలువ రోడ్డులో కోడిపందెం ఆడు తున్న నలుగురి నుంచి రూ.3,850 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనపరుచుకున్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు రిమ్స్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప మాసాపేటకు చెందిన హర్షవర్ధన్ కడప నగరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి రాజంపేట రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద దిగి అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని...

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె కనిపించడం లేదని రజక వీధికి చెందిన మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోరుమామిళ్లలోని రజకవీధిలో నివాసం ఉంటున్న 17 సంవత్సరాల బాలిక మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

ఒక్కరోజు వాన

- ఎకరాకు రూ.5వేలు నష్టం
- తడిసిన మొక్కజొన్నలు
- తగ్గిన ధర... రైతుల ఆవేదన

రాజుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం అష్ట కష్టాలు పడి పంటలు పండించిన రైతన్నలను నష్టాలు ఏదోక రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టుకునేందుకు రోడ్లపైకి తోలారు. అయితే సోమవారం ఉదయం భారీ వర్షం పడడంతో మొక్కజొన్నలు తడిసి ముద్ద య్యాయి. దీంతో మరుసటిరోజు తెరిపి రావడంతో పంటను ఆరబెట్టుకు నేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇక ధర ఒక్క రోజులోనే క్వింటా రూ.2200 పలుకుతున్న మొక్కజొన్నలు రూ.1700కు పడిపోయాయి. దీంతో రైతుకు ఎకరాకు రూ.5వేలు నష్టం వచ్చిందని, మూడునెలలు పంటను అన్నివిధాలుగా రక్షించుకుని తీరా చేతికొచ్చే సమయంలో ఒక పక్క రేటు లేకపోవడం, మరో పక్క వర్షానికి నానడంతో రైతులు దిగులు చెందుతు న్నారు. ఇంకా దాదాపు 300 ఎకరాల్లో పంట కోత దశలో ఉంది. వర్షం పడకపోతే నూర్పిళ్లు జరుగుతాయని, అధిక వర్షం పడితే పంట దెబ్బతిం టుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండురోజులు వర్షం పడకపోతే కొంత మేరగట్టెక్కవచ్చని రైతులు అంటున్నారు.2 తడిచిన మొక్కజొన్నలు



తడిసిన మొక్కజొన్నలను ఆరబోసిన తర్వాత రాసిగా పోస్తున్న రైతులు

తడిసిన మొక్కజొన్నలు

ప్రయాణికుల బారి నుంచి రక్షణ కల్పించండి

- నిరసనలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు

కడప మారుతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఆళ్లగడ్డకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరును దువ్వూరు వద్ద ఆపి డ్రైవరు తలపై గాయం చేయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఆర్టీసీ అద్దె బస్సులకు చెందిన పలువురు డ్రైవర్లు కడప ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అద్దె బస్సు కడప, ప్రొద్దుటూరు డిపోకు చెందిన డ్రైవర్లు మాట్లాడారు. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ అధికమవుతుందన్నారు. దీంతో బస్సులు జనాలతో నిండిపోతున్నాయన్నారు. నిండిపోయిన బస్సులు బస్టాపుల్లో నిలపడం లేదనే కోపంతో ప్రయాణికులు డ్రైవర్లపై దాడులకు దిగడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమం వద్దకు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు ఆర్టీసీ ఉద్యోగులు (కండక్టర్లు, డ్రైవర్లు) పట్ల సంయమనం పాటించాలన్నారు. స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న సంగతి వాస్తవమేనన్నారు. అయినప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో ప్రయాణికులకు సేవలందిస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రయాణికులు దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. సఖ్యతగా మెలగాలని సూచించారు. కాగా, అద్దె బస్సుల డ్రైవర్ల నిరసనతో కడప రీజియన్ పరిధిలోని డిపోలో గల 225 అద్దె బస్సుల్లో 48 బస్సులు బుధవారం ఆగిపోయాయి. దీంతో కడప నుంచి ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, రాయచోటి తదితర ప్రాంతలాకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. అయినప్పనటికీ మధ్యాహ్నం నుంచి తిరిగి యదావిధిగా బస్సులు తిరిగినట్లు ఆర్టీసీ ఆర్ఎం వెల్లడించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి



అద్దెబస్సులు ఆగిపోవడంతో బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

టమోటా రైతులకు
గిట్టుబాటు ధర కల్పించాలి



టమోట గ్రేడింగ్ సెంటర్‌లో రైతులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

లింగాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టమోట ధరలు పతనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. లింగాల మం డ లం అంబకపల్లె టమోట గ్రేడింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట దిగుబడులను మార్కెట్‌లో అమ్ముకోలేక రైతులు రోడ్డు పక్కన పడేస్తుండడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా కేజీ రూ.20తో కొనుగోలు చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 బాల బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లాకు మంచి పేరుతీసుకురావాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, నీలకంఠరావు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డిపో సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు దేవగుడి గ్రామంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మె ల్యేకు వివరించారు. ప్రధానంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ఉందని, ఎక్కువగా అద్దె బస్సులు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అలాగే జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు రద్దు చేసి ఆర్డినరీ సర్వీసులుగా మార్చాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాడిపత్రి, ప్రొద్దుటూరు, ఆళ్లగడ్డ, మరికొన్ని గ్రామాలకు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిసింది. కార్యక్రమంలో కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ చైర్మన్ శేషన్న, డిపో అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి ఎంజీసీవో రెడ్డి, నాగేంద్ర, గ్యారేజీ కార్యదర్శి వలి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డిలతో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

జడ్పీలో పదోన్నతులు

- 16 మందికి సీనియర్ అసిస్టెంట్లు, ఏవోలుగా...
- నేడు వారి వారి స్థానాలలో బాధ్యతలు

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 16 మందికి పదోన్నతులు కల్పించారు. వీరిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు ఏవోలు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. పదోన్నతులు పొందిన వారికి ఆయా శాఖల్లో ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకామల్లేశ్వరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు అర్హత కలిగిన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతులు పొందిన ఉద్యోగులు వీరే...

సుండుపల్లె ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కె.స్వర్ణలతను వల్లూరు ఎంపీపీ కార్యాలయ ఏవోగా, మైదుకూరు మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఎంవీ వీరప్రసాద్‌రెడ్డిని చెన్నూరు మండల ఏవోగా, రాజంపేట పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను రాజుపాళెం మండల ఏవోగా, లింగాల మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నరసింహకుమార్‌ను వీఎన్ పల్లె మండల ఏవోగా, పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్వేతవాహనరెడ్డిని ముద్దనూరు మండల ఏవోగా పదోన్నతి కల్పించారు. అలాగే కడప జడ్పీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరాజును ఖాజీపేట ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, బద్వేల్ పీఆర్ఐ సబ్ డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సి.బాలరాజును పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.విజయను టి.సుండుపల్లె మండల సీనియర్ అసిస్టెంట్‌గా, పులివెందుల ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎ.ఉమాదేవిని పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, తొండూరు ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎమనోహర్‌ను పులివెందుల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, వేంపల్లె పీఆర్ఐ సబ్ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని లింగాల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, కడప జడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైవీ నాగేశ్వర్‌రెడ్డిని బద్వేల్ ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, రాజంపేట పీఆర్ఐ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న బి.నరేంద్రనాద్‌ను రాజంపేటలోని పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, బి.కోడూరు మండలంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎస్.గౌస్‌పీర్‌ను పోరుమామిళ్ల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, పెద్దముడియం ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కిరణ్‌మూర్తిని రాజుపాళెం ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, మైదుకూరు ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న డి.అన్వర్ బాషాను అదే మండలంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. పదోన్నతులు పొందిన పై ఉద్యోగులందరూ గురువారం వారి వారి స్థానాలలో బాధ్యతలను చేపట్టనున్నారు.

పిల్లల విద్య, ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలను జడ్జి విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయసహాయం మొదలగు అంశాలను తెలియజేశారు. అలాగే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలోని పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో చట్టాలపై జడ్జి అవగాహనను కల్పించారు.

కల్తీ మద్యం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జగన్ తన ప్రభుత్వంలో కల్తీ మద్యం లేదని చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జె బ్రాండ్ మద్యం వల్ల వేలాది మంది అనారోగ్యాలతో పాటు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంలోని మద్యం పాలసీతో ప్రభుత్వ ఖజానాకు గండి పడి ప్రభుత్వ పెద్దలకు బినామీలకు పెద్ద ఎత్తున మేలు జరిగిందన్నారు. అందువల్లే మద్యం కుంభకోణంలో వరుసగా అరెస్టులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ వారు ఈ కల్తీ మద్యం కేసులో వుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే వారిని పార్టీ నుంచి బహిష్కరించారన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో పాత్ర వున్న తన పార్టీ వారిని ఒక్కరినైనా పార్టీ నుంచి బయటికి పంపారా అని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య 39వ వార్డు ఇన్‌చార్జ్ సిద్దయ్య పాల్గొన్నారు.

వరిలో రోగ నిరోధక శక్తికి పొటాష్ వాడాలి

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగు చేసిన వరి పైరుకు రోగ నిరోధకశక్తి కోసం పొటాష్ తప్పకుండా వాడాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మదూరు గ్రామంలో బుధవారం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి ఎకరాకు 90 కేజీలకు మించి యూరియాను వాడితే అగ్గి తెగులు, దోమపోటు సోకుతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు నాగరాజు మాట్లాడుతూ రైతులు పైర్లకు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడితే భూసారం తగ్గి నిరుపయోగంగా మారుతుందన్నారు. మండల వ్యవసాయాధికారులు దేవీ పద్మలత, స్వాతి, వీపీఏలు నందిత, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

గన్నెపాటి మల్లేశ్‌ను పరామర్శించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్



కడప, ఎర్రముక్కపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నెపాటి మల్లేశ్ భార్య గన్నెపాటి సుజాత మరణం పట్ల రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ సంతాపం తెలిపారు. బుధవారం జవహర్ ప్రత్యేకంగా కడపకు చేరుకొని మల్లేశ్ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నేతలు

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను జిల్లాప్రధాన కార్యదర్శి ఆర్‌బి, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం సిలాస్ బుధవారం కడప ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క సమర్పించి శాలువతో సన్మానించారు. 7వ డివిజన్ ఇన్‌చార్జి మాజీ కార్పొరేటరు గొంటుముక్కల చిన్నబాబు, 183 బూత్ కన్వీనరు బోనం అబ్రహం పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కడపకు విచ్చేసిన సందర్భంలో కడపనేతలు మర్యాదపూర్వకంగా స్వాగతించారు. బుధవారం 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చవలముడి శంకర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఎస్సీ సెల్ నాయకుడు వీరయ్య వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కడప మారుతీనగర్..: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను స్థానిక ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో పలు పార్టీల ప్రజాసంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. అందులో భాగంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధికార ప్రతినిధి వెదురూరు బాబు, సుబ్బారావు కలిశారు.

టీడీపీ నాయకుడి మృతి...నివాళులర్పించిన ఎమ్మెల్యే



పెండ్లిమర్రి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పగడాల పల్లె గ్రామా నికి చెందిన టీడీపీ నాయ కుడు చిన్న మల్లారెడ్డి (59)బుధవారం మృతి చెందాడు.విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి మృతుని స్వగ్రామానికి చేరుకుని పార్థివ దేహనికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, రఘునాథరెడ్డి,ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవేలో చీకట్లే..నా?

లైట్లు వెలగకపోతే పట్టించుకునే దిక్కులేదా..?



చెన్నూరు హైవేలో కొత్తరోడ్డు వద్ద లైట్లు వెలగక పోవడంతో అలుముకున్న చీకటి

చెన్నూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు వద్ద హైవేలో ముఖ్యంగా అటు ప్రధాన వీధిలోకి ఇటు వల్లూరు వెళ్లే దారిలో ఉన్న కొత్తరోడ్డు సెంటరులో చీకటి పడితే లైట్ల వెలుగులు కనిపించడం లేదు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఈ దారి ముఖ్యంగా ప్రధాన కూడలి. అలాంటి స్థితిలో లైట్లు చాలా రోజులుగా వెలగక పోవడంతో ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. హైవే సిబ్బంది బాధ్యతగా ఇక్కడ లైట్లు వెలగకపోతే వాటిని సరిచేసి వేయాల్సి ఉంది. అయితే చాలా రోజులుగా చీకట్లు కనిపిస్తున్నా హైవే సిబ్బంది మాత్రంనిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. హైవే ఏర్పాటు చేసినప్పుడే కొన్నేళ్లపాటు వాటి నిర్వహణ ఉంటుంది. అయితే నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు అయిన తరువాత ఈ కొత్త రోడ్డు ప్రాంతంలో ప్రజలు ఎంతో కాలంగా అడగ్గా ఎట్టకేలకు తూతూమంత్రంగా లైట్లు ఏర్పాటు చేశారు. అవి కూడా సరిగ్గా వెలగకపోవడంతో ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతతో మరలా కాస్త వెలుతురు వచ్చే లైట్లను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొద్దికాలంగా ఆ లైట్లు కూడా వెలగడం మానేశాయి. సాయంత్రం 6.30 అయితే చీకటి ఇరువైపులా దుకాణాలు ఉన్నప్పటికీ వాటి యజమానులు వేసుకునే లైట్లు ఆ దుకాణాల వరకే పరిమితమవు తున్నాయి. ఆ దారిన వచ్చి పోయే వారు రోడ్డు దాటాలంటే లైట్ల వెలుతురు లేదు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు వేగానికి బలి కావాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో లైట్లు వేయండి మహాప్రభో అని నెత్తి నోరు కొట్టుకుంటున్నా ఇంత వరకు స్పందన లేదు. ప్రజలు మాత్రం హైవే వారు వేస్తారో, ట్రాన్స్‌కో వేస్తారో ఎవరు వేస్తారో మాకేం తెలియదు, లైట్లను వేసి ప్రమాదాల బారిన పడకుండా కాపాడండి మహాప్రభో అంటున్నారు.

సొంత నిధులతో బోరు



చక్రాయపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి తన సొంత నిధులతో బోరు ఏర్పాటుచేశారు. బుధవారం మండలంలోని సురభి గ్రామం కోమటిపేటలో నీటి ఎద్దడి నెలకొనడంతో బోరు వేశారు. తన సొంత డబ్బు రూ.1.50లక్షలు ఖర్చు చేసి బోరు ఏర్పాటుచేయిస్తున్నారు. అలాగే ఇంటింటికి కొళాయి కూడా తెప్పించేందుకు కృషిచేస్తున్నారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన

లింగాల,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలంటే ఆత్మవిశ్వాసంతో పాటు నిరంతర సాధనెంతో అవసరమని ఎంఈఓలు విశ్వనాథ్‌రెడ్డి, రామకృష్ణయ్య అన్నారు. లింగాల మండలం పార్నపల్లె ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్, కబడ్డీ, చెస్ క్రీడా పోటీలను నిర్వహించారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

చెన్నూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలపల్లెలో నూతనంగా వెలసిన సీతారాముల ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మూడురోజుల పాటు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



కమలాపురంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

కమలాపురం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగి స్తాయని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులసి తెలిపారు. బుధవారం గురుకుల పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వెంకటసుబ్బన్న ఇతర పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: ఎస్‌జీఎఫ్ 2025-26 సంవత్సరానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతకొమ్మదిన్నెలో బుధవారం జరిగినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వేల్పుల నాగార్జునయ్య తెలిపారు. పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ యోగా పోటీలను ఎంఈవో సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు, 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో కబడ్డీలో సీకేదిన్నె జిల్లా పరిషత్ హైస్కూలు విన్నర్‌గా, జె.కొత్తపల్లె జిల్లా పరిషత్ హైస్కూలు రన్నర్‌గా నిలిచాయన్నారు. వాలీబాల్‌లో జె.కొత్తపల్లె విన్నర్‌గా, సీకేదిన్నె రన్నర్‌గా నిలిచాయన్నారు.

కడప స్పోర్ట్స్..: ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికల్లో భాగంగా బుధవారం స్పోర్ట్స్ స్కూలులో కడప మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ఇందులో అండర్ -14, 17 బాలబాలికలకు వివిధ పోటీల్లో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొని విజయం సాధించి మండల జట్టుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీఈటీ, ఎస్‌ఏపీఈ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సాజిద్, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటరు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట జీఎస్టీపై అవగాహన కార్యక్రమం

కడప, ఎడ్యుకేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశా లలో బుధవారం జీఎస్టీపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.జ్ఞానేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, శ్రీరాములురెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: జీఎస్టీ 2.0 పై బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించి,అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణాలకు వెళ్లి సూపర్ జీఎస్టీ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి,ప్రిన్సిపాల్ ఇందిర,సర్పంచ్ నాగమల్లారెడ్డి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: ప్రతి ఒక్కరూ గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్‌టి)పై అవగాహన కలిగి ఉండాలని పులివెందుల జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ ఆర్.రాజశేఖర్‌రెడ్డి విద్యార్థినులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, డాక్టర్ రమీజ, జీఎస్టీ సిబ్బంది పుష్పలీల, టి.స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కడప ఎడ్యుకేషన్,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బయోడైవర్సిటీ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని వైవీయూ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ కంట్రోల్ బోర్డు, సహకారంతో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష అధ్యక్షతన వైల్డ్ లైఫ్-25, బయోడైవర్సిటీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించగా, పోస్టర్ ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బయోడైవర్సిటీ కో-ఆర్డినేటర్ ఎస్.ఖాదరవల్లి, బోటనీ విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వైవీయూలో రిజిస్ట్రార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైవీయూ విద్యార్థులు పాల్గొన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మినుములను పంపిణీ చేస్తున్న అధికారులు

సీకేదిన్నె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మినుములో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్ తెలిపారు. స్థానిక కేవీకేలో బుధవారం వల్లూరు మండలంలోని దిగువపల్లె గ్రామానికి చెందిన 50 మంది రైతులకు మినుములో ఎల్‌పీజీ 884, వీడీఎన్ 08 రకాలను 150 ఎకరాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మహేష్‌బాబు,శాస్త్రవేత్తలు ప్రశాంతి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తంకండి

కడప మారుతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదికపార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో గల జేసీఐపీ కార్యాలయంలో బద్వేలు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బద్వేలు నియోజ కవర్గ ఉపాధ్యక్షులు బి.ఆంజ నేయులు, అట్లూరుమండల అధ్యక్షు డు మల్లికార్జున, కాశినాయన మండల అధ్యక్షుడు అబ్బయ్య పాల్గొన్నారు.

ఉల్లి రైతుల కష్టాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

వీరపునాయునిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల కష్టాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకునేందుకు కృషిచేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని సంగాలపల్లె గ్రామంలో రైతులు సాగుచేసి వర్షాలతో దెబ్బతిన్న ఉల్లి పంటలనుపరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘునాథరెడ్డి, అలిదెన వాసుదేవరెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

భవిత కేంద్రానికి దాతలసహకారం అభినందనీయం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేంపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రానికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ అన్నారు. బుధవారం నరసింహారెడ్డి, సుకన్యల 40వ పెళ్లి రోజు వేడుకను వేంపల్లె భవిత దివ్యాంగుల విద్యావనరుల కేంద్రంలో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికి దుప్పట్లు, టై, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్‌లో పిల్లలకు టైలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెయిన్ స్కూల్ హెచ్ఎం ఆంజనేయులు, సులోచన, చంద్రకళావతి, భవిత సిబ్బంది యశోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప మారుతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఎస్ఐ సెంట్రల్ చర్చి బిషప్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ అన్నారు. వరప్రసాద్ జన్మదిన సందర్భంగా బుధవారం సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ ప్రతినిధులు బెనహర్, ఆనంద్, సాల్మన్, ప్రశాంత్, గురువులు పాల్గొన్నారు.

ఘనంగా పుత్తా జన్మదిన వేడుకలు



కమలాపురంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



చెన్నూరులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు

కమలాపురం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డిజన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పుత్తా జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాఘవరెడ్డి, మండల నాయకులు కంకర సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, కాపు నాయకులు దాది రామయ్య, మల్లేశ్, పల్లె రామసుబ్బారెడ్డి, విభారపురం రాఘవరెడ్డి టీడీపీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చెన్నూరు..: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి ప్రజా సేవాతత్పరుడని మండల టీడీపీ శ్రేణులు కొనియాడాయి. బుధవారం పుత్తా నరసింహారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చెన్నూరు పార్టీ కార్యాయలంలో బుధవారం మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వెంకట సుబ్బారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నీటిసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, షబ్బీర్ హుస్సేన్, సుధాకర్‌రెడ్డి, ఆకుల చలపతి, మంజూరు అహ్మద్, చెంగల వెంకటసుబ్బయ్య, రామన చంద్ర మోహన్‌రెడ్డి, డాక్టర్ పిచ్చయ్య, బెస్తకాలనీ సుబ్బయ్య, ఐ.శివారెడ్డి, పాలగిరి పెద్దసుబ్బారెడ్డి జి.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వల్లూరు..: టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్య క్షుడు నాగేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండోడైరెక్టరు శివారెడ్డి, చెన్నారెడ్డి, టి.సుబ్బారెడ్డి (చిన్నన్న), రమణారెడ్డి, రామయ్య, రాఘవరెడ్డి, చిట్టిబాబు, శంకర్‌రెడ్డి, సురేశ్, పుత్తా అనుచరులు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివాలయం వద్ద బారీ కేక్ కట్ చేసి టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్టారెడ్డి, మోహన్‌బాబు, నాగిరెడ్డిపల్లె సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్‌బాబు, సీకేదిన్నె సింగిల్‌విండో ఛైర్మన్ శంకర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్, వీరాప్రసాద్, నజీర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను కడపనగరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కడపనగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీనగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగాకేక్ కట్ చేసి పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాళ్లు చిప్పగిరి మీనాక్షి, స్వర్ణలత, విజయలక్ష్మి, నాయకులు నజీర్, దస్తగిరి పాల్గొన్నారు.







వల్లూరు, సీకేదిన్నె, కడప నగరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కరువు భత్యం, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

రాజుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరువు భత్యం, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాజుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి జూలై 2025 వరకు రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్లకు నాలుగు విడతల కరువు భత్యం ప్రకటించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు విడతల కరువు భత్యం ఇప్పటికే ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉన్నా ఇప్పటి వరకు కమిషన్‌ను కూడా నియమించలేదన్నారు. రావాల్సిన 11వ పీఆర్సీ, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

● హయ్యర్ బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసన ● ఆగిన బస్సు సర్వీసులు ● ఇబ్బందులు పడిన ప్రయాణికులు


ప్రొద్దుటూరులో నిరసన తెలుపుతున్న హయ్యర్ బస్సుల డ్రైవర్లు


మైదుకూరులో నిరసన ఆపాలని డ్రైవర్లతో చర్చిస్తున్న సీఐ, ఆర్టీసీ డీఎం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసనతో బుధవారం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దువ్వూరులో అద్దె బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా స్థానిక అద్దె బస్సు డ్రైవర్లు విధులను బహిష్కరించడంతో బస్సు సర్వీసులు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా అద్దె బస్సుడ్రైవర్ల నిరసనతో 62 బస్సుల్లో 41 బస్సులు రన్నింగ్‌లో ఉండగా 21 బస్సులు ఆగడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కొంతమేర అసౌకర్యం కలిగిందన్నారు. డ్రైవర్‌పై దాడికి పాల్పడినవారిపై కేసు నమోదు కావడంతో వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసన

అద్దె బస్సు డ్రైవర్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో అద్దె బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వూరులో అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం ద్వారా బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు బస్సు ఫుట్‌పాత్‌లపై నిలబడి ప్రయాణిస్తున్నారని, దీంతో బస్సులు ఎక్కడపడితే అక్కడ ప్రయాణికులు చేతులెత్తడంతో బస్సు డ్రైవర్ ఆపకపోతే దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన స్టాపింగుల్లోనే బస్సు నిలిపే విధానం అమలు చేసి ఆ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దాడికిపాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో అద్దె బస్సుల మేనేజర్లు రాజనాల, శ్రీను, సాల్మన్, డానియేల్, హయ్యర్ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆగిన ఆర్టీసీ అద్దె బస్సులు

మైదుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళవారం దువ్వూరు వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం మైదుకూరు ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు బస్సులను బస్టాండు ఆవరణంలో నిలిపి నిరసన తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలిసిన సీఐ రమణారెడ్డి దాడి చేసిన వారిపై కేసు నమోదు అయిందని, విచారించి న్యాయం చేస్తామని, డ్రైవర్లు నిరసన ఆపి విధులకు వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా అద్దె బస్సు డ్రైవర్లు మాట్లాడుతూ స్టేజీ లేకపోయినా ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడ ఆపమంటున్నారని, ఆపకుంటే అసభ్యంగా దుర్భాషలాడుతూ దాడులు చేస్తున్నారని, తమపై జరుగుతున్న దాడుల గురించి అధికారులు, బస్సుల యజమానులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రాణాలు అడ్డం పెట్టి ఉద్యోగాలు చేస్తే తమకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా శివనాగిరెడ్డి



కొండాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఆర్.శివనాగిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. పీఎస్ఐ నుండి ఫస్ట్ పోస్టింగ్ తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీరోడ్డులోని రోటరీ కంటి ఆస్పత్రిలో షుగర్ పేషెంట్లకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ ఆస్పత్రి అధ్యక్షుడు కోట శివకుమార్, కార్యదర్శి ఎంవీఎం ప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం, శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు షుగర్ పేషెంట్లకు, వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు

దువ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దువ్వూరులో స్థానికంగా బస్టాండు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎండకు, వానకు రోడ్ల మీద నిలబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవతో దువ్వూరులో బస్సు షెల్టర్ ఏర్పాటు చేశారు. అటు ప్రొద్దుటూరు, ఇటు మైదుకూరు, ఆళ్లగడ్డ వెళ్లే బస్సులు నిలబడే ప్రదేశాన్ని ఎన్నుకుని ఈ షెల్టర్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు తాత్కాలికంగా ఇబ్బందులు తొలగనున్నాయి.

జీఎస్టీపై అవగాహన

పోరుమామిళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ బుధవారం పోరుమామిళ్లలోని 58వ పోలింగ్‌బూత్ పరిధిలో ఉన్న ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పంచాయతీ అభివృద్ధిపై ప్రమాణానికి సిద్ధం : ఎంపీపీ

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధిపై, మైదుకూరు రోడ్డులో నెలకొన్న సమస్యలపై తాను చేసిన వ్యాఖ్యలకు ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను కొత్తపల్లె పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలు, కుంటుపడుతున్న అభివృద్ధిపై ప్రశ్నిస్తే సర్పంచ్ శివచంద్రారెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సర్పంచుకు సంబంధించిన రూములను మార్కింగ్ వేసిన మేరకు తొలగించి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై చాలా స్పష్టతతో ఉన్నానని, ఈ అంశంపై కాణిపాక దేవస్థానంలో ప్రమాణం చేసేందుకు సిద్ధం కావాలని ఆయన సవాలు విసిరారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి

బద్వేలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని బయనపల్లె చెరువు, చిన్నంపల్లె గ్రామపొలం సర్వే నెం.1567/1ఏలో 1.54 ఎకరాల భూమి ఆక్రమణకు యత్నిస్తున్నారని, సదరు సర్వే నెంబరు చెరువు పేరున ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ ఇతరుల పేర్లు ఎక్కించి చెరువు రస్తా, భూములను కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే ఆక్రమణకు గురైన 1.54 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జకరయ్య, అనిల్, బాబు, విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యుల సాయం

దువ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దువ్వూరుకు చెందిన యశ్వంత్, లక్ష్మి చిన్నారులకు ప్రొద్దుటూరు వాత్సల్య ట్రస్టు సభ్యులు బుధవారం సాయం అందింది. ఈ పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన విషయం తెలిసి నాగలక్ష్మి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు కాత్యా, హరీష్ చేయూతతో బియ్యంతో పాటు రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సౌజన్య, సభ్యులు సలీం, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కొండయ్య సేవలు మరువలేనివి

అట్లూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు కొండయ్య సేవలు మరువలేనివని ఎంఈవో విలియం రాజు తెలిపారు. మండలంలోని ఎస్.వెంకటాపురం గ్రామంలోని బెడుసుపల్లె ఎంపీపీ స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సెప్టెంబరు 30న పదవీవిరమణ చేసిన కొండయ్యకు బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సన్మానసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఖాదర్‌వల్లి, రామాంజనేయరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఎం.బాబు, గురుమూర్తి, సోము, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 19మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ప్యాడ్ డిజైనింగ్, ఆటోక్యాడ్ డిజైన్ ఇంజనీర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలో పాలిటెక్నిక్ ఈఈఈ విద్యార్థి ఒకరు, ఈసీఈ విద్యార్థులు ముగ్గురు, బీటెక్‌లో సివిల్‌లో నలుగురు, ఈఈఈలో ముగ్గురు, ఈసీఈలో అయిదుగురు, ఎంబీఏలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

'ప్రధాన న్యాయమూర్తిపై దాడి.. రాజ్యాంగంపై దాడి'

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం రాజ్యాంగంపై దాడిగా భావించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో రెండవ రోజు సీపీఎం ప్రాంతీయ రాజకీయ శిక్షణా తరగతులు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై సనాతన ధర్మం పేరుతో దాడి చేయడం దారుణమని, ఈ దాడిని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని కోరారు. ట్రంప్ విధించిన టారీఫలపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం దారుణమని, దీని వలన దేశానికే నష్టమన్నారు. వైసీపీ, టీడీపీలు అధికార వ్యామోహం వలన జిల్లా అభివృద్ధిపై దృష్టిపెట్టడం లేదని విమర్శించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, పులివెందుల మెడికల్ కళాశాల ప్రారంభం, కడప-బెంగుళూరు రైల్వే లైను పూర్తి చేయాలని డిమాండు చేశారు. రైతులకు యూరియా కొరత లేకుండా, స్మార్ట్‌మీటర్లను ఉపసంహరించి ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామమోహన్, పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సర్వేశ్వరి, సాల్మన్, విజయకుమార్, మహబూబ్‌బాష, రమేష్, రామచంద్రారెడ్డి, చంటి, వెంకటసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టులో ఘటన దురదృష్టకరం


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

జమ్మలమడుగు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం జమ్మలమడుగులోని గాంధీ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై మరో న్యాయవాది కోర్టులో అందరి సమక్షంలో బూటుతో దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, పట్టణాధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షులు సుబహాన్, గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు మునిస్వామి, నరసింహులు, చెన్నయ్య, బుడగ జంగం సంఘం నాయకులు నల్లప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి ప్రకాశం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి

కాశినాయన, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుండి విద్యార్థులకు నిర్వహించనున్న చెకుముకి సైన్సు టాలెంట్ పరీక్షలను జయప్రదం చేయాలని జేవీవీ మండల అధ్యక్షుడు, మూలపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరచంద్రశేఖర్ ఆచారి తెలిపారు. బుధవారం నర్సాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు సంబరాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఫిజిక్స్, బయాలజికల్ సైన్సులో పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 18న పాఠశాల స్థాయిలో, నవంబరు 1న మండల స్థాయిలో, నవంబరు 23న జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీ పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి ఖాసీవలి, ఉపాధ్యాయులు బి.వెంకటసుబ్బారెడ్డి, వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద దివ్యాంగులకు ఇంటిస్థలాలు, వ్యవసాయ భూములు ఇవ్వాలి


బి.కోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పేద దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు ఇవ్వాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన దివ్యాంగులకు ప్రభుత్వం ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, మండలంలో దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని, గ్రామీణప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ఐదెకరాల భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షన్ తప్ప ఏ ఆధారం లేని దివ్యాంగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, నిరుద్యోగ దివ్యాంగులకు కల్పించాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులను చేర్చి వారు ఎంపిక చేసుకున్న పనిని వారు చేయగలిగే విధంగా అప్పగించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు గొడుగునూరు బాలరాజు, మురళి, దేవా, మహిళా కన్వీనరు ఓబులమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు నిర్మాణంపై రికార్డుల పరిశీలన

మైదుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అలుగు వంక స్థలాన్ని ఆక్రమించి పెట్రోలు బంకు నిర్మించారని వచ్చిన లోకాయుక్త ఫిర్యాదు మేరకు బుధవారం తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఆర్టీసీ డీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే చేసి ఆక్రమణలో ఉన్న పెట్రోలు బంకు గోడను తొలగించారని, ఈ మేరకు అప్పటి తహసీల్దార్లు వివరణ కూడా ఇచ్చారన్నారు. దీనిపై మళ్లీ ఫిర్యాదు రావడంతో పరిశీలనకు వచ్చామని, రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రంగస్వామిని వివరణ కోరగా ఆక్రమణ జరిగింది వాస్తవమేనని, గతంలో వచ్చిన ఫిర్యాదుకు మేరకు ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. రికార్డులను పరిశీలించి రీసర్వే చేయిస్తామన్నారు.

రైతులను రెచ్చగొట్టడం న్యాయమా..?

● మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర



మైదుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతుంటే పరామర్శ కోసమని వెళ్ళి రండి ధర్నాలు చేద్దాం, కలెక్టరేట్‌ను ముట్టడిద్దామని రైతులను రెచ్చగొట్టడం న్యాయమా అని మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల వద్దకు వెళ్లి బాధిత రైతులను కలవకుండా మట్టి అంటకుండా, చొక్కా నలగకుండా కల్లాలలో, రహదారులలో పని చేసుకుంటున్న కూలీలతో మాట్లాడుకుంటూ పోతే పరామర్శ అవుతుందా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల లాగా పరుగెడుతున్నాయని, ఉల్లి రైతుల కోసం ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేలు నష్టపరిహారం ప్రకటించిందన్నారు. వైసీపీ హయాంలో 600 ఎకరాల పంట నమోదైతే కూటమి ప్రభుత్వంలో 1000 ఎకరాలు నమోదు చేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని ఎవరు తీసుకువచ్చారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించకుండా రైతులపై విషం చిమ్ముతారా అని మండిపడ్డారు.

మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 6/2025

సోమేసుల శ్రీనివాసులు తండ్రి రామయ్య, వయస్సు 42 సం., వ్యవసాయం, కోటవీధి, పోరుమామిళ్ళ (గ్రా. & మం.) వైఎస్ఆర్ కడపజిల్లా - పిటీషనర్/వాది

V/s

1) పంది గురివిరెడ్డి తండ్రి నడిపి గురివిరెడ్డి, వయస్సు 33 సం., వ్యవసాయం, రెడ్డినగర్, రంగసముద్రం పంచాయితి పోరుమామిళ్ళ టౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా.
2) పంది మంజునాథ్‌రెడ్డి తండ్రి నడిపి గురివిరెడ్డి వయస్సు 45 సం. రెడ్డినగర్, రంగసముద్రం పంచాయితి పోరుమామిళ్ళ టౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా - రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పై నెంబరు కేసులో పిటీషనరు, వాది, రెస్పాండెంట్స్ మరియు ప్రతివాదులు అయిన మీపైన దావా దాఖలు చేసినారు. 1వ ప్రతివాది, 1వ రెస్పాండెంట్ అయిన మీపైన రు. 27,28,704/-లు వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు మరియు I.A.No. 90/2025 under Or 39R1 పిటీషన్‌కూడా మీ ఇరువురిపైన దాఖలుచేసియున్నారు. సదరు మొత్తం చెల్లించనంతట Mandatory ఇంజక్షన్ ద్వారా షెడ్యూల్ దాఖలా ఆస్తిని స్వాధీనపర్చవలసినదిగా కోరుచూ పిటిషన్ మరియు దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో రెండవ ప్రతివాది, రెస్పాండెంట్‌గా కూడా పార్టిగా చేర్చినందున మీరిరు వురు రాజశ్రీ కోర్టు వారి ఎదుట 23-10-2025వ తేది ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను మరియు పిటిషన్‌ను తీర్మానించబడును.

షెడ్యూల్: House bearing D.No. 11/287 situated at YSR Kadapa (Dist) Proddatur Regd. Dist, Badvel Sub-Dist, Porumamilla Mandal, Rangasamudram Panchayat limits at 2nd Line of Reddy Nagar and Bounded on the : East : House of Chinna Gurivi Reddy, South : Joint Wall of Chinna Ramaiah, West : House of Pandi Gurivi Reddy (1st Defendant) North : Rastha

పి.బి.ఎన్.ప్రసాద్, అడ్వకేట్, బద్వేలు.